ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో?



మహిళలందరికీ ఉచితంగా బస్సు ప్రయాణమని చెబితే ఎంతో ఆశ పడి టీడీపీకి ఓట్లే శాము. బాబు అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తోంది. ఆడవాళ్లందరూ ఎప్పుడెప్పుడు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేస్తారా అని ఎదురుచూస్తున్నాం. చెప్పిన మాట ప్రకారం హామీ నిలబెట్టుకోవడమే మా కోరిక.

- జబీన్‌తాజ్, అప్పారావుతోట, మదనపల్లె

ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తారా?



టీడీపీ అధికారంలోకి వచ్చి 50 రోజులు అవుతోంది. చంద్రబాబు వస్తే ప్రతి ఇంటికీ మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాడంటే టీడీపీకి ఓట్లేశాం. ఇప్పటివరకు వాటి గురించి ప్రస్తావించడం లేదు. చెప్పిన మాట ప్రకారం వెంటనే ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తే కొంతమేరైనా ఆర్థికభారం తగ్గుతుంది.

- ఇమామ్‌బీ, బాపనకాల్వ, మదనపల్లె

రైతుకు రూ.20 వేల సాయం చేస్తారా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాతలకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు అందిస్తామని తెలిపింది. చెప్పినట్లుగానే తాము ఓటు వేసి గెలిపించడంతో అధికారంలోకి వచ్చింది. రైతులందరూ వేరుశనగ పంటలో కలుపు తీసేందుకు ఖర్చు పెరుగుతోంది. సాయం అందితే కొంత ఊరట లభిస్తుంది. కొంతైనా ఆర్థికభారం తగ్గుతుంది.

- రామచంద్రప్ప, పెద్దకురప్పల్లె, రామసముద్రం

నిరుద్యోగ భృతి ఇస్తారా..?



పట్టా పుచ్చుకొన్న యువకులకు ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు దాటినప్పటికీ ఆ ఊసే ఎత్తట్లేదు. ప్రభుత్వం అందించే నిరుద్యోగ భృతిపై ఆశలు పెట్టుకున్నాం. నిరుద్యోగులకు అండగా ఉండాలి.

- బత్తుల్‌రెడ్డి, అమ్మినేని వీధి, మదనపల్లె

తల్లికి వందనం ఎప్పుడు...?



ఎన్నికలకు ముందు ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేలు అందిస్తామని బాబు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తక్షణమే ఈ పథకం అమలు చేస్తారని భావించాం. పిల్లలకు పాఠశాలలు తెరవడంతో యాజమాన్యాల నుంచి ఫీజు చెల్లించాలని ఒత్తిడి పెరుగుతోంది. తక్షణమే తల్లికి వందనం ఖాతాకు జమ చేస్తే మాకు ఆర్థిక భారం తగ్గుతుంది.

-లక్ష్మీ, గాజులనగరం, రామసముద్రం

రూ.1500 సాయం ఎక్కడ?



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా 19 నుంచి 59 సంవత్సరాల లోపు ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థికం సాయం చేస్తామని ప్రకటించారు. ప్రకటించిన మేరకు ఈ ఏడాది ఇప్పటి వరకూ సాయం అందలేదు.

- మద్దిరాళ్ల నాగవేణి, మర్రికుంటపల్లి, కలికిరి

బాబు ష్యూరిటీ..
మోసం గ్యారెంటీ

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్




ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	95,000	14.25
తంబళ్లపల్లె	90,607	13.59
పీలేరు	11,8,787	17.81



నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	35,000	10.50
తంబళ్లపల్లె	91,200	27.36
పీలేరు	14,700	4.41



'అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ.. వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం.. నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తాం.. ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఖాతాలకు జమచేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతాంగం పంటల సాగు పనుల్లో ఉన్నారు. అయినా వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకం ఇంత వరకూ అతీ గతీ లేదు. గత ఐదేళ్లలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

తల్లికి వందనం ఎప్పుడిస్తారు..?



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పింది. ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇంత వరకూ అతీగతీ లేదు. దానిపై ప్రస్తావనే లేదు. నాకు ఇద్దరు పిల్లలు న్నారు. రూ.30 వేలు రావాలి. ఇంత మోసం చేస్తారని అనుకోలేదు.

- శ్రీవల్లి, కొత్త ఇందిరమ్మ కాలనీ, వాల్మీకిపురం

రూ.20 వేల సాయం అందుతుందా?



ఖరీఫ్ సీజన్‌లో ఉన్న కొద్దిపాటి పొలంలో టమాటా, వేరుశనగ, వరి సాగు చేస్తున్నాను. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కొనుగోళ్లకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రకటించిన రూ.20వేలు అందిస్తే, కొంతమేరకైనా భారం తగ్గించినట్లవుతుంది.

- రవి, చింతలవారిపల్లె, నిమ్మనపల్లె



టీడీపీ ఒక్కో ఏడాదికి అన్నదాతా సుఖీభవకు కేటాయించాల్సింది

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	22,157	44.31
తంబళ్లపల్లె	48,230	96.46
పీలేరు	44,730	89.46



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి వందనం అందాల్సిన సాయం

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	35,781	53.67
తంబళ్లపల్లె	27,658	41.48
పీలేరు	28,029	42.04



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	1,50,000	15.00
తంబళ్లపల్లె	1,10,000	11.00
పీలేరు	1,40,000	14.00

నోట్: ఒక మహిళ రోజూ సరాసరిగా రూ. 100 చార్జీ చెల్లిస్తుందని అంచానా



ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	42,000	10.74
తంబళ్లపల్లె	80,827	20.68
పీలేరు	93000	23.79

మహిళలకు ఇచ్చిన హామీ అమలుచేయాల్సిందే



చంద్రబాబు హామీ ఇవ్వడం.. అధికారం వచ్చాక మాట మార్చడం పరిపాటి. గతంలోనూ డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి సీఎం కుర్చీ ఎక్కాక నిలువునా మోసం చేశారు. ఈసారి పార్టీల పొత్తుతో సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చారు. మహిళలకు ప్రతి నెలా రూ. 1500, తల్లికి వందనం, ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు హామీలు అమలయ్యేంత వరకూ గ్యారంటీ లేదు.

- నాగరాణి, అంగళ్లు, కురబలకోట మండలం

ఉచిత బస్సు ప్రయాణం ఉత్తిదేనా..?



టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే తెలంగాణ తరహాలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఎన్నికల పర్యటన సందర్భంగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గట్టి హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారం చేపట్టి.. మంత్రులు సమావేశమైనా హామీ దిశగా ఎలాంటి ఏర్పాట్లు జరగడం లేదు. ఇప్పటికీ దానిపై ప్రస్తావనే లేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గాలికి వదిలేసినట్లే.. ఇపుడు అధికారంలోకి వచ్చాక హామీలన్నీ గాలికి వదిలేశారు. చేయలేనప్పుడు ఎందుకు హామీ ఇవ్వాలి. తెలంగాణ, కర్ణాటకలో అమలు చేస్తున్నట్లు ఇక్కడ అమలు చేయాల్సిందే.

- సుధారాణి, చింతలవారిపల్లి, వాల్మీకిపురం

రైతు భరోసా

ఒక్కో ఏడాదికి అందిన సాయం



నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	22,157	29.91
తంబళ్లపల్లె	48,230	65.11
పీలేరు	44,730	60.38

అమ్మ ఒడి

ఒక్కో ఏడాదికి అందిన సాయం



నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
మదనపల్లె	35,781	53.67
తంబళ్లపల్లె	27,658	41.48
పీలేరు	28,029	42.04

నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇచ్చి ఆదుకోవాలి



ఇటీవలే నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ఎదురు చూశాను. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగావకాశం కల్పించాలి. లేనిపక్షంలో నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల భృతి అందించాలి. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తుండడంతో దరఖాస్తు, కోచింగ్ కోసమైనా ఆ మొత్తం ఉపయోగపడుతుంది. ఏదైనా పరిశ్రమల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తే ఇంకా బాగుంటుంది.

-సబిహా కౌసర్, పెద్దతిప్పసముద్రం

ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారు?



ఎన్నికల పర్యటనకు వచ్చినపుడు కష్టపడుతున్న మహిళలకు ఆసరాగా ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. ప్రతి ఇంటికి కచ్చితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి రాష్ట్ర నేతలతో పాటు స్థానిక అభ్యర్థులు ఈ అంశంపై ప్రచారం చేశారు. ఇప్పుడేమే దాని గురించే మరచిపోయారు. పేదలందరం గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారా ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చాక ఇంత మోసం చేస్తారని అనుకోలేదు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పడం నమ్మి ఓట్లు వేశాం. అసలు ఉచితంగా ఇస్తారో, ఇవ్వరో తెలియదు.

- శిరీష, పీలేరు

ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

తంబళ్లపల్లె: మండలంలో పక్కా ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ నాగరాజు కోరారు. బుధవారం ఆయన లేవుట్ కాలనీలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులతో చర్చించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో వేసిన బోర్లు ఇంకిపోవడంతో నీటి సమస్య ఉన్నట్లు లబ్ధిదారులు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని కె.రెడ్డివారిపల్లి 1, 2, 3 లేవుట్ కాలనీలను హౌసింగ్ మండల ప్రత్యేకాధికారి భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లేవుట్‌లలో నెలకొన్న తాగునీరు, విద్యుత్ సదుపాయం తదితర సమస్యలపై హౌసింగ్ లబ్ధిదారులు ఆయనకు దృష్టికి తెచ్చారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

నిమ్మనపల్లె : వ్యవసాయ, అనుబంధశాఖల రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటకోత ప్రయోగాలపై బుధవారం నిమ్మనపల్లెలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మురళీమోహన్, మండల గణాంకాధికారి ఏఎస్‌ఓ జగన్నాథం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు సాగు చేసిన పంటల వివరాలు సర్వే నంబర్ల వారీగా నమోదుచేయాలన్నారు. అదేవిధంగా దిగుబడులకు సంబంధించి కచ్చితమైన వివరాలు అందజేయాలన్నారు.

పరామర్శ

కలకడ : అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న కలకడ సర్పంచ్ ఫ్యారీజాన్ కుమారుడు, వైఎస్సార్‌సీపీ రాజంపేట మైనార్టీ కన్వీనర్ షావత్ అలీఖాన్‌ను పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్ పరామర్శించారు. బుధవారం షావత్ అలీఖాన్ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి.. ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆరోగ్యంపై అశ్రద్ధ చూపకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణరెడ్డి, కలకడ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు అంజన్‌కుమార్, సద్దాం, సలీం పాల్గొన్నారు.

రాయితీపై ఉలవ విత్తనాల పంపిణీ

మదనపల్లె : ఖరీఫ్ రైతులకు ప్రత్యామ్నాయ పంటల ద్వారా సాగు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీతో ఉలవ విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ఏఓ నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె మండలానికి 324 క్వింటాళ్ల ఉలవ విత్తనం కేటాయించారని తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

కురబలకోట: విజయవాడ వరద బాధితులకు అంగళ్లలోని గోల్డన్‌వ్యాలీ విద్యా సంస్థల నిర్వాహకులు, రాష్ట్ర ఇంజినీరింగ్ కళాశాలల అసోషియేషన్ రాయలసీమ జోన్ సెక్రటరీ ఎన్వీ రమణారెడ్డి రూ.11 లక్షల చెక్కును రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు బుధవారం అందజేశారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

వాల్మీకిపురం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామని వైస్ ఎంపీపీ వెంకటరమణ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవంలో వైస్ ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. జ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ మనోహర రాజు, జెడ్పీటీసీ నిర్మల, ఈవో ఉదయ్ కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఝరికోన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేవీపల్లె : ఝరికోన ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం క్రాస్‌లో ఝరికోన ప్రాజెక్టు కార్మికులు పలువురు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝరికోన కార్మికులకు 2023 నవంబర్ నుంచి జీతాలు చెల్లించలేదని, జీతాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడనాటి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మదనపల్లె : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. పారిశుద్ధ్యం మెరుగు, స్వచ్ఛతే లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవ-2024 పేరుతో అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని డీపీఓ తెలిపారు. బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో విద్యార్థులు, అధికారులు 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని డీపీఓ ధనలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, డీఎల్‌డీఓ లక్ష్మీపతి ప్రారంభించారు. మున్సిపల్ ఆర్వో నాగేశ్వరరావు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు సల్మాన్, విష్ణు, భార్గవి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల స్పెషలాఫీసర్ విజయ్‌మోహన్, ఎంపీడీఓ కేఎస్ బాలాజీ అన్నారు. రెండో రోజు జరిగిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా అధికారులు పలు పంచాయతీల్లో పర్యటించారు.

కేవీపల్లె : స్వచ్ఛతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఈఓపీఆర్‌డీ గఫూర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కేవీపల్లెలో విద్యార్థులచే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

తంబళ్లపల్లె: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య తెలిపారు. బుధవార స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణంలో మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. మండల కేంద్రంలో జరుగుతున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని డీఎల్‌పీఓ నాగరాజు పరిశీలించారు.